స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి


డీటీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న గిరిధర్ నాయక్

చాంద్రాయణగుట్ట: ఉస్మానియా మెడికల్ కళాశాల ఎంబీబీఎస్ గిరిజన విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని గిరిజన సంఘం నాయకుడు సభావత్ గిరిధర్ నాయక్ కోరారు. ఈ మేరకు విద్యార్థులతో కలిసి జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కోటాజీని బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ల నుంచి స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడంతో ఫీజులు కట్టలేక ఇబ్బందులకు పడుతున్నారన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఆయన వెంట విద్యార్థులు బనావత్ తిరుపతి, ఆంగోతు మధుకర్ ఉన్నారు.

24న వసతి గృహాలకు శంకుస్థాపన

● కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రకుమార్

సుల్తాన్‌బజార్: ఈనెల 24న ఉస్మానియా వైద్య కళాశాల విద్యార్థులకు నూతన వసతి గృహాల నిర్మాణానికి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా శంకుస్థాపన చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రకుమార్ తెలిపారు. బుధవారం ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉస్మానియా కళాశాల నిర్మించినప్పుడు వైద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహాలు ప్రస్తుతం నివాసయోగ్యంగా లేవన్నారు. దీంతో ఈ విషయాన్ని వైద్యారోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి రూ.121.90 కోట్లతో విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరుగా నూతన వసతి గృహాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారని తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ చీఫ్ ఇంజినీర్ దేవేంద్రకుమార్, ఈఈ సురేందర్ రెడ్డి బృందం బుధవారం కళాశాలను సందర్శించి శంకుస్థాపన ఏర్పాట్లను పర్యవేక్షించారని ఆయన తెలిపారు.


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రకుమార్ తదితరులు

ఆదర్శ్‌నగర్‌లో 'కాఫీ విత్ కార్పొరేటర్'


సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటీ మేయర్ శ్రీలత, కార్పొరేటర్

అబిడ్స్: గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ భీశ్వ సురేఖ 'కాఫీ విత్ కార్పొరేటర్' కార్యక్రమాన్ని బషీర్‌బాగ్ ఆదర్శ్‌నగర్‌లో బుధవారం నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి పాల్గొన్నారు. డిప్యూటీ మేయర్, కార్పొరేటర్, అధికారులు కలిసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వాటర్ బోర్డు అధికారులు వెంకట్, సరిత, ఇతర అధికారులు శివశంకర్, రాష్ట్ర బీజేపీ దళితమోర్చా ఉపాధ్యక్షుడు భీశ్వ ఓంప్రకాశ్, కాంగ్రెస్ నాయకులు చేతన్, బస్తీ అధ్యక్షులు బాబు, నితీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌గనర్ దాయిబాగ్ శ్రీ హనుమాన్ బాలాజీ మందిరంలో 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం లంగర్‌హౌస్ ముచుకుందానది వీర రాఘవ రామాలయం ప్రధాన అర్చకుడు రాహుల్‌దాస్ బాబా చేతుల మీదుగా ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ అనంతరం అన్నదానం ప్రసాదం అందజేశారు. గురువారం శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు గొరిగె శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు పి.సత్యంచారి, ఉపాధ్యక్షుడు సుదర్శనం, కార్యదర్శి రమేశ్, శ్రీనివాస్, సామల శ్రీనివాస్, డబ్ల్యూ పవన్, కే రాంచందర్, అశోక్, గొరిగే యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

గోల్కొండ: నిరుపేద రోగుల సహాయకులకు భోజనం అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని గోల్కొండ సెకండ్ లాన్సర్ బాలుర ప్రభుత్వోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్ అన్నారు. పలు ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద స్నేహితులతో కలిసి బుధవారం రోగుల సహాయకులకు భోజన ప్యాకెట్లు, వాటర్‌బాటిల్స్ అందించారు.

ఘనంగా ఆలే నరేంద్ర జయంతి

గోల్కొండ: ఆలే నరేంద్ర జయంతి వేడుకలను బుధవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నామ యాదగిరినేత, ముఖేశ్, శివరాజ్‌యాదవ్, శ్రీకాంత్‌సాగర్, కెప్టెన్ యాదగిరి, శివాజీ తదితరులు ఉన్నారు.

26, 27న శ్రీకృష్ణ జన్మాష్టమి

అబిడ్స్: ఈ నెల 26, 27 తేదీల్లో మంగళ్‌హాట్ పూసలబస్తీలో 72వ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆర్కిటెక్ ఇంజినీర్, వాస్తు శిల్పి ఆవుల కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ ఆవుల అరుణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 26న తెల్లవారుజామున 5 గంటలకు స్వామివారి అభిషేకంతో వేడుకలు ప్రారంభమవుతాయని, మధ్యాహ్నం 12 గంటలకు హవనం, రాత్రి 7 గంటలకు భజన కీర్తనలు, రాత్రి 12 గంటలకు శ్రీకృష్ణ డోలారోహణం ఉంటుందని తెలిపారు. 27న ఉదయం 11 గంటలకు సత్యనారాయణ స్వామి వ్రతం, సాయంత్రం 5 గంటలకు బాల బాలికలకు శ్రీకృష్ణ, యశోద రాధ, గొల్లభామల వేషాధారణ పోటీలు ఉంటాయన్నారు. సాయంత్ర 6 గంటలకు ఉట్ల కార్యక్రమం ఉంటుందని ఆవుల కృష్ణారావు, ఆవుల అరుణ తెలిపారు. విజేతలకు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు.

చదువుతో పాటు సామాజిక బాధ్యత నేర్పించాలి

చాంద్రాయణగుట్ట: పిల్లలకు చదువుతో పాటు సామాజిక బాధ్యత నేర్పించాలని ఫలక్‌నుమా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే ప్రవీణ్ కుమార్ అన్నారు. తెలంగాణ సిటీజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో కళాశాలలో కోల్‌కతాలో లైంగిక దాడి, హత్యకు గురైన ట్రైనీ వైద్యురాలికి శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు.



శ్రద్ధాంజలి ఘటిస్తున్న విద్యార్థులు

అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎల్.శశికళ, సిటీజన్ కౌన్సిల్ పాతబస్తీ అధ్యక్షుడు ఎన్.రామకృష్ణ శాస్త్రీ, చీఫ్ కో-ఆర్డినేటర్ ముత్యం యాదవ్, అధ్యాపకులు డేవిడ్, గంగాధర్, కాంగ్రెస్ గ్రేటర్ ఓబీసీ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అభిరుచితోనే అన్ని రంగాల్లో రాణింపు

విజయనగర్‌కాలనీ: ప్రత్యేక అభిరుచి గల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారని ఫైన్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ అన్నారు. మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ ప్రాంగణంలో బుధవారం అప్లైడ్ ఆర్ట్స్ విద్యార్థులు గ్రాఫిక్ డిజైన్ వర్క్స్ డిస్‌ప్లే ప్రదర్శనశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నో ప్లాస్టిక్, మహిళలపై అత్యాచారాలు, గ్రామీణ వాతావరణం తదితర ఇతివృత్తాలపై విద్యార్థులు ఏర్పాటు చేసిన గ్రాఫిక్ డిజైన్ వర్క్ ఆలోజింప చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అప్లైడ్ ఆర్ట్స్ విభాగాధిపతి ప్రొఫెసర్లు ఎంఎల్.ఆనంద్, హరీశ్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కళాకృతులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ గంగాధర్ తదితరులు

సెప్టెంబర్ 1న భజన పోటీలు

గోల్కొండ: భజన భారతీ, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న భజన పోటీలు నిర్వహించనున్నట్లు సమితి ప్రతినిధి జొన్నకుంటి మధుసుధన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుడిమల్కాపూర్‌లోని రాంసింగ్‌పురాలో గల బీకే భవన్‌లో ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభవుతాయని పేర్కొన్నారు. పురుషులు, మహిళలు, పిల్లలతో పాటు గానం, నృత్య బృందాల కోసం పోటీలు ఉంటాయని, ఒక్కో బృందంలో ఐదుగురికి తక్కువ కాకుండా 20 మందికి మించకుండా ఉండాలన్నారు. పాల్గొనే బృందాలు తమతమ వాయిద్యాలను వెంట తీసుకురావచ్చని ఒక్కో బృందానికి 10 నిమిషాల సమయం కేటాయిస్తామని తెలిపారు. పోటీలు తెలుగు, హిందీ భాషల్లోనే ఉంటాయని, పూర్తి వివరాలకు 9398822069, 9493967399 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగంగారి ప్రీతం అన్నారు. రవీంద్రభారతీలో తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరం ప్రథమ మహాసభను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగ కులస్తులంతా కలిసి ఉండాలని అప్పుడే జర్నలిస్టులపై దాడులు జరిగితే ఐక్యంగా ఎదుర్కోవచ్చన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీల్లోనూ ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి మాట్లాడుతూ.. మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు అమలయ్యేవరకు పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల నరేందర్ మాదిగ, గౌరవ సలహాదారులు వత్తుల రఘుపతి, చెంచు లింగయ్య, ప్రధాన కార్యదర్శి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ కోరారు. బహదూర్‌పురా ఎమ్మెల్యే ముబిన్‌తో కలిసి బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ పైపులైన్ల పనులు వెంటనే పూర్తి చేయాలని, అలాగే వీధిలైట్ల నిర్వహణ కూడా అధ్వానంగా ఉందన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని బల్దియా కమిషనర్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.


బల్దియా కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కౌసర్, ముబిన్

ఇద్దరు మొబైల్ స్నాచర్ల అరెస్టు

చార్మినార్: ఇద్దరు మొబైల్ స్నాచర్లను చార్మినార్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 18న ఓ వ్యక్తి ఫోన్ మాట్లాడుతూ మీరాలం మంచి కమాన్ నుంచి పత్తర్ గట్టి వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఫోన్ లాక్కుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చార్మినార్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి వారి నుంచి బైక్‌తో పాటు దొంగిలించిన మొబైల్ ను స్వాధీనం చేసుకున్నారు.

నేడు టీపీసీసీ ఆధ్వర్యంలో నిరసన

గౌలిపురా: అదానీ కుంభకోణంపై దర్యాప్తు విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని నిరసిస్తూ గురువారం అసెంబ్లీ వద్ద ఉన్న గన్‌పార్కు అమరవీరుల స్తూపం నుంచి ఈడీ కార్యాలయం వరకు టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదట హిండెన్‌బర్గ్ నివేదిక ద్వారా కుంభకోణం విషయం బహిర్గతమైందన్నారు. నిరసన కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇన్‌చార్జి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, చైర్మన్లు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం

నాంపల్లి: షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఏరియా ఆసుపత్రి పార్కింగ్‌లోని ఓ గదిలో బుధవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో రోగులు భయందోళనకు గురై పరుగులు పెట్టారు. గది నుంచి దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన ఆసుపత్రి సిబ్బంది బకెట్లతో నీళ్లను తీసుకువచ్చి ఎగిసిపడుతున్న మంటలను ఆర్పివేశారు. పలు పరికరాలు, మందులు ఫైల్స్ కాలిపోయాయి. ఘటనా స్థలాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ సందర్శించి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

'మాల సంఘాల తీరు సరికాదు'

చాంద్రాయణగుట్ట: సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును అవహేళన చేస్తూ మాల సంఘాలు భారత్ బంద్‌కు దిగడం సరైంది కాదని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు, దళిత చైతన్య వేదిక సభ్యుడు జాలిగం చిరంజీవి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వర్గీకరణ జరిగితే 59 ఉప కులాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. మంద కృష్ణ చేసిన పోరాటంలో న్యాయం ఉందని అందుకే ప్రధాని నరేంద్ర మోడీ కూడా మద్దతు పలికారన్నారు. అన్నదమ్ముల్లా కలిసి ఉన్న వారి మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు.

రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ సందర్శన



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ కార్యాలయాన్ని హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర కో ఆపరేటివ్ బృందం బుధవారం సందర్శించింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బ్యాంక్ ప్రధాన ఆర్థిక వివరాలు, పురోగతి, టర్నోవర్ వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. హిమాచల్ ప్రదేశ్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ దేవేందర్ సింగ్ షాన్, ఎండీ శర్వన్‌కుమార్ తెలంగాణ అధికారుల పనితీరును మెచ్చుకున్నారు. అనంతరం టెస్కాబ్ సీజీఎం జ్యోతి, హిమాచల్ బృందం సభ్యులను సన్మానించారు.

ముగ్గురి నిందితులకు రిమాండ్

సంతోష్‌నగర్: సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను బుధవారం సంతోష్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి ఓ ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కాలాపత్తర్ తాడ్‌బన్ ప్రాంతానికి చెందిన షేక్ ముజాహిద్ గత ఏప్రిల్ 29న షేక్ ముజాహిద్ సంతోష్‌నగర్ గుల్షన్ ఎక్బాల్ కాలనీ ప్రాంతంలో వేచి ఉండగా మీర్‌పేట్ నందనవనం కాలనీకి చెందిన బోయ సుధాకర్ (25), బి.గణేశ్ అలియాస్ గన్ను (23), మొగిలి సాయి కుమార్ (19) వచ్చి సెల్‌ఫోన్‌ను దొంగలించారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు అప్పటి నుంచి పరారీలో ఉన్న సుధాకర్, గణేశ్, సాయి కుమార్ బుధవారం పిసల్‌బండ ఎక్స్ రోడ్డు జేఎస్ ఆర్ వైన్స్ ప్రాంతంలో ఉన్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి అరెస్ట్ చేశారు. వారి నుంచి హోండా యాక్టివా, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

న్యాయవాదులపై దాడులు అరికట్టాలి

సిటీ కోర్టులు : న్యాయవ్యవస్థలోని సమస్యలతో పాటు న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ రాష్ట్ర హోం శాఖ ప్రధాన కార్యదర్శి రవిగుప్తాను లాయర్స్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రి స్వామి బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట న్యాయవాదులు నాగుల శ్రీనివాస్ యాదవ్, నరేందర్, కరికే మల్లేశ్, బి.హనుమంతు, చంద్రబాబు తదితరులు ఉన్నారు.

24న రౌండ్ టేబుల్ సమావేశం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసాచారీ, కార్యవర్గ సభ్యులు

యాకుత్‌పురా: న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌పై చర్చించేందుకు ఈ నెలా 24 న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. శ్రీనివాసా చారి పేర్కొన్నారు. పురానీహవేలీలోని సిటీ సివిల్ కోర్టులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సంబంధిత వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులపై దాడులకు పాల్పడిన పోలీసులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సివిల్ కోర్టులో శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లా బార్ అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శులు, బార్ కౌన్సిల్ చైర్మన్, కార్యవర్గ సభ్యులు, న్యాయవాద ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయ పార్టీల లీగల్ సెల్ కన్వీనర్లు, న్యాయ నిపుణులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో బార్ అసోసియేషన్ కే. ఉపాధ్యక్షురాలు ప్రవీణా రెడ్డి, ప్రధాన కార్యదర్శి డీ. హర్షవర్ధన్, సంయుక్తా కార్యదర్శి బర్కా రాజేశ్ కుమార్, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గంజాయి నిందితుడికి జైలు


సల్మాన్ ఖాన్

గౌలిపురా: గంజాయితో తిరుగుతున్న నిందితుడిని పట్టుకుని నాంపల్లిలోని స్పెషల్ జ్యూడిషియల్ కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ డీసీ ఉమాపతి రావు 7 రోజుల జైలు శిక్ష విధించారు. ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టా రోడ్డు నంబర్-4 సల్మాన్ ఖాన్ (33) భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న భవానీనగర్ పోలీసులు సల్మాన్ ఖాన్‌ను ఆపి తనిఖీ చేయగా గంజాయి లభించింది. దీంతో సల్మాన్‌ను అరెస్ట్ చేసి బుధవారం నాంపల్లిలోని స్పెషల్ జ్యూడిషియల్ కోర్టులో హాజరు పర్చగా పూర్వ పరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి



సంతోష్‌నగర్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బైరామల్‌గూడకు చెందిన యాతం కృష్ణమ్మ (55) కుమారుడు యాగం జంగయ్యతో కలిసి ఉంటుంది. కృష్ణమ్మ చాంద్రాయణగుట్ట పరివార్ టౌన్‌షిప్‌లో కూలీ పని చేస్తుంది. కాగా బుధవారం ఉదయం 5 గంటలకు కృష్ణమ్మ పని నిమిత్తం చాంద్రాయణగుట్ట పరివార్ టౌన్‌షిప్‌కు వెళ్తుండగా మిధాని బస్సు డిపో వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణమ్మ తీవ్రంగా గాయపడ్డది. చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడు జంగయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెప్టెంబర్ 22న శ్రీ విరాట్ విశ్వకర్మ మహోత్సవం

సుల్తాన్‌బజార్: విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ భవనం వెల్ఫేర్ ట్రస్ట్ సౌజన్యంతో సెప్టెంబర్ 22వ తేదీన ఉప్పల్ భగాయత్‌లోని విశ్వకర్మ ఆత్మ గౌరవ భవనంలో శ్రీ విరాట్ విశ్వకర్మ మహోత్సవం-2024 నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ లాలకోట వెంకటాచారి తెలిపారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మహోత్సవం అధ్యక్షుడు బొడ్డుపల్లి రవి ప్రశాంత్‌చారి, ప్రధాన కార్యదర్శి బబ్బోజు భిక్షపతిచారి, కోశాధికారి మహేశ్వరపు సూర్య ప్రకాశ్‌చారి, ఉపాధ్యక్షుడు చొప్పదండి రామకృష్ణచారితో కలిసి యజ్ఞ మహోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17న నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని వినాయక నిమజ్జనం కారణంగా సెప్టెంబర్ 22కు మార్చామని తెలిపారు. మహాయజ్ఞం పీఠాధిపతులు బ్రహ్మశ్రీ రామడుగు నరసింహ చార్యులు, రవాణా బ్రహ్మశ్రీ వేటూరి సుబ్రహ్మణ్య చార్యులు బృందం వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మహోత్సవ ప్రతినిధులు మదన్మోహన్‌చారి, వీరాచారి, జంగాచారి, రవీంద్రచారి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ చైర్మన్ లాలకోట వెంకటాచారి

ఎస్సీ వర్గీకరణ అమలుకు తక్షణమే ఆర్డినెన్స్ తేవాలి

గన్‌ఫౌండ్రీ: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే ఆర్డినెన్స్ తీసుకురావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్‌లోని బాబుజగ్జీవన్‌రాం చౌరస్తాలో సుప్రీం కోర్టు తీర్పును తక్షణమే అమలు చేయాలని కోరుతూ బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాదిగ, ఉప కులాలకు రిజర్వేషన్ల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన మాదిగ జాతి అభివృద్ధికి మాల సోదరులు కూడా కలిసి రావాలని కోరారు. సమావేశంలో బోడ బుడగ జంగాల జేఏసీ చైర్మన్ హన్మంత్, మాదిగ ఉపకులాల నేతలు మంచాల యాదగిరి, జీడీ నర్సింహా, రుక్కమ్మ, జ్యోతి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.


బషీర్‌బాగ్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న మేడి పాపయ్య మాదిగ తదితరులు

'సయీద్‌బిన్ మహ్మద్' వెబ్‌సైట్ ఆవిష్కరణ

విజయనగర్ కాలనీ: ప్రముఖ కళాకారుడు సయీద్‌బిన్ మహ్మద్ గొప్ప వ్యక్తిత్వం గలవారని ప్రొఫెసర్ గంగాధర్ అన్నారు. సయీద్‌బిన్ మహ్మద్ వెబ్‌సైట్‌ను బుధవారం మాసాబ్‌ట్యాంక్‌లోని ఫైన్‌ఆర్ట్స్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గంగాధర్ మాట్లాడుతూ సయీద్‌బిన్ మహ్మద్ నేటి యువ చిత్రకారులకు మార్గదర్శకుడని అన్నారు. కార్యక్రమంలో అబీబ్‌బిన్ మహ్మద్, జెమిల్ నిషాత్, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.


సయిద్‌బిన్ మహ్మద్ వెబ్‌సైట్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

సమస్యలు పరిష్కరించాలని సీఎంకు వినతి

అబిడ్స్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్‌షరీఫ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కలిశారు. ఆదిల్‌షరీఫ్, విజయ్‌కుమార్, మాజీ మంత్రి చిన్నారెడ్డిని కలిసిన బృందం సమస్యలతో కూడిన మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆదిల్‌షరీఫ్ మాట్లాడుతూ.. సీపీఎస్ పెన్షన్ స్కీం రద్దు చేసి పాత స్కీం అమలు చేయాలన్నారు. తెలంగాణ ఉద్యోగులకు సమానంగా జీహెచ్‌ఎంసీ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని, అలాగే 125 గజాల స్థలం, ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సూచించారు. కార్యక్రమంలో శివకుమార్ పాల్గొన్నారు.


సీఎంకు మెమొంటోను అందజేస్తున్న ఆదిల్ షరీఫ్ తదితరులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అబిడ్స్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ బేగంపేట ఏసీపీ శంకర్‌రాజు పేర్కొన్నారు. రోడ్డు భద్రతపై గోషామహాల్‌లోని పోలీస్ ట్రైనింగ్ విద్యార్థులు, సిబ్బందికి పవర్ ప్రజంటేషన్ ద్వారా బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హీరోమోటర్ కంపెనీ నుంచి శ్రవణ్‌కుమార్, ఏసీపీ విక్రమ్‌దేవ్, ఆర్ఐ నర్సింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.